## క్లుప్తంగా

### భగవద్గీత పుస్తకాలు అందజేత

మరికల్: మండల కేంద్రంలో విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యువతకు బుధవారం భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా భజరంగ్ దళ్ కమిటీ మండల అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీత పుస్తకాలను చదివి హిందుధర్మం పరిరక్షణకోసం పాటుపడాలని సూచించారు.

### జిల్లా కో ఆర్డినేటర్ల నియామకం

నారాయణపేట: పేట జిల్లాయూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్‌లుగా దామరగిద్ద మండలం లింగారెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్, కోటకొండకు చెందిన నవీన్‌లను నియమించినట్లు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలను సోషల్ మీడియా వేదిక ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, కొత్తగా నియామకమైన కో–ర్డినేటర్లకు సూచించారు.

### నేటి మహాధర్నాను విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధనకు చేస్తున్న దీక్షలు వందరోజులకు చేరనుండటంతో గురువారం జిల్లా కేంద్రంలోని మహాధర్నా చేపట్టాలని సాధనసమితి సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా చేయాలని, వెంటనే ప్రభుత్వం జీఓ ఇచ్చేవిధంగా ఎమ్మెల్యే కృషిచేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని శ్రీవివేకానంద మున్సిపాల్ పార్క్ వద్ద జరిగే మహాధర్నాకు ఆయాగ్రామాల ప్రజలు, అఖిలపక్షం నాయకులు తరలి వచ్చి మద్దతు తెలపాలని, ధర్నా విజయవంతం చేసి ఆకాంక్షను సాధించుకుందామన్నారు. గ్రామంలోని శిబిరంలో బుధవారం 99వ రోజు శిబిరంలో దీక్షలు కొనసాగించారు.

### పారదర్శక సేవలు

నారాయణపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకమైన సేవలను అందిస్తామని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఎస్.జయప్రసాద్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని, ఎవరికైనా అవసరమైతే సెల్ 8712670417కు కాల్‌చేసి ఫిర్యాదులు, సమాచారం అందించాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ పీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చోరీలు జరగకుండా పెట్రోలింగ్ ఏర్పాటుచేస్తామని, ప్రతిగ్రామానికి విలేజ్‌పోలీస్ ఆఫీసర్ల నియామకం జరిగిందన్నారు. మహిళ రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### పెద్ద చెరువుకు జలకళ



మరికల్: జూరాల వరద నీటిని కోయిల్‌సాగర్‌కు వదలడంతో తీలేర్ పంపుహౌస్ నుంచి డి.16 కాల్వకు వస్తున్న నీటితో ఇప్పటికే తీలేర్ పెద్ద చెరువు, మరికల్ నాన్ చెరువు, కనకల్ చెరువులు నిండి పెద్ద చెరువుకు భారీగా నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. వేసవిలో చేపలను పట్టేందుకు చెరువులోని నీటిని పూర్తిగా దిగువకు వదలారు. ప్రస్తుతం పది రోజుల నుంచి వస్తున్న నీళ్లతో క్రమంగా చెరువు అలుగు వరకు నీళ్లు రావడంతో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### గుండెపోటుతో వ్యక్తి మృతి

మాగనూర్: మండలంలోని వర్కూర్‌లో ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఇసుకరీచ్ వద్ద టిప్పర్ ద్వారా నిత్యం ఇసుక తరలిస్తున్న వ్యక్తి బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోయిలకొండ మండలం మల్కాపూరం గ్రామానికి చెందిన వెంకటయ్య టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోసించుకుంటున్నాడు. అయితే రోజులాగే వర్కూర్‌కు ఇసుకకోసం రాగా ఇసుకను లోడ్ చేసుకుని వీఆర్ఏతో క్యాప్చర్ చేయిస్తుండగా స్పృహకోల్పోయి కిందపడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న కొందరు అతడిని స్థానిక ప్రభుత్వఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్సకోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతిడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

కృష్ణా: మండంలలోని కున్సిగ్రామానికి చెందిన బస్వరాజ్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. బుధవారం పదోతరగతి బ్యాచ్ మిత్రబృందం ఆయన కుటుంబానికి రూ.41,100ల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్వరాజ్ కుటుంబానికి ఆధారమైన తమ స్నేహితుడు అకాలమృతి చెందడంతో తమవంతుగా ఆర్థిక సాయాన్ని అందించినట్లు మిత్రులు శివ, రాజు, కతలప్ప, రమేష్ తెలిపారు.

# మక్తల్‌ను అగ్రగామిగా నిలుపుదాం

● ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ఆర్‌ఓ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: దేశంలోనే రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అగ్రగామిగా నిలిపారని, మనమందరం కలిసికట్టుగా పనిచేసి మక్తల్ నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వర్కూర్‌లో నిర్వహించిన ఆర్‌ఓ ప్లాంట్, డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి కుర్వలకు 24యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న కూడా అన్నిపార్టీలను కలుపుకుని వెళ్లి అభివృద్ధి పనులు చేస్తున్నామని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు గొల్ల, కుర్వలను పట్టించుకోలేదని, కేవలం వారిని ఓటుబ్యాంక్‌గా మాత్రమే వాడుకున్నారని విమర్శించారు. గొర్రెలు పంపిణీ చేసి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా గ్రామంలో డీఎంఎఫ్ ఫండ్ ద్వారా రూ. 3లక్షల 65వేల ఆర్‌ఓప్లాంట్, డ్రెయినేజీ రూ. 10 లక్షలతో నిర్మాణంతోపాటు గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మలమ్మ గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, రైతుసమన్వయ కమిటీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ రాజు, మల్‌రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, తిప్పిరెడ్డి, అనిల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: గ్రామాలను అభివృద్ధి చేయడమే కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముస్లాయిపల్లిగ్రామ కుర్వలకు ఉచితంగా గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తులకు ప్రతి ఒక్కరికీ లక్ష రూపాయలు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. గృహలక్ష్మిపథకం కింద ప్రతి నియోజకవర్గానికి మూడువేల ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకుని సంక్షేమ పథకాలనుఏర్పాటుచేసి ప్రజలను ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీడీ కార్యాలయ ముట్టడికి ఎస్ఎస్ఏ ఉద్యోగులు



హైదరాబాద్ తరలివెళ్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నారాయణపేట రూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లాలోని ఎస్ఎస్ఏ ఉద్యోగులు హైదరాబాద్‌లోని ఎస్పీడీ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని, మినిమం టైం స్కేల్ ఇవ్వడం లేదని వాపోయారు. ఉద్యోగభద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రసూతి సెలవులు కేటాయించాలని, మృతిచెందిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రవిప్రకాష్, నారాయణ, రాజశేఖర్, రాజు, హుసేనప్ప, మహిపాల్, నాగేందర్, మహేష్, శివకుమార్ పాల్గొన్నారు.

## నేటి నుంచి బీజేపీ ఆందోళన

నారాయణపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతి పాలనపై రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెల 17నుంచి ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీబంధు, దళితబంధు, గిరిజన బంధు, గృహలక్ష్మి లబ్ధిదారులను గుర్తించి వారిచే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసనలు, 18న నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ల వద్ద నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను పార్టీ నాయకులు, వివిధపథకాల లబ్ధిదారులు పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి: అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా తమపేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఓటర్ల నమోదు, తుది జాబితా తయారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై బూత్‌లెవల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటు హక్కు అవశ్యకతను సమగ్రంగా వివరించి నూతన ఓటర్లను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుభాష్‌రెడ్డి, బుగ్యాసాబ్, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## గోశాల ఏర్పాటుకు తీర్మానం



కృష్ణా: గుడెబల్లూర్‌లో లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గోశాల ఏర్పాటుకు గ్రామ అఖిలపక్షాల నాయకులు బుధవారం తీర్మానించారు. ఈ సందర్భంగా అర్నకులం గోశాల అధిపతి రఘు ప్రసన్న భట్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ సురేష్ మాట్లాడుతూ.. పట్టణాల్లో గోశాలాలను ఏర్పాటు చేస్తుండడం, మళ్లీవాటి సంతతిని పెంచేందుకు కృషి చేస్తుండడం శుభ పరిణామని అన్నారు. ఆలయ ప్రాంగణంలో ఓ గోషాలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని ఆలోచనతో గ్రామ అఖిల పక్షాల నాయకులతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే గోశాల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గోసేవా ప్రముఖ్‌గా పూజారి వాసుదేవ్, సహాయ ప్రముఖ్‌గా కాశీనాథ్, సభ్యులుగా సునిల్, చక్రవర్తి, చిదానంద్, నరేష్, రాఘవేంద్ర, రవీంద్ర, రవి, కిట్టు, చిన్నయ్యలను ఎన్నుకున్నారు. సమావూశంలో సర్పంచ్ మహాదేవమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, మాజీ సర్పంచ్ కృష్ణామూర్తి, గ్రామ ప్రముఖులు సిద్రాంరెడ్డి, సిద్రామప్ప, వెంకటేష్, ఆంజనేయులు, వీహెచ్‌పీ నాయకులు బీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యబృందం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో సీఎస్సీ హెల్త్ కేర్ వెల్నెస్ సెంటర్స్ ఆధ్వర్యంలో భవననిర్మాణ కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. హెల్త్ కార్డు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వైద్యచికిత్సలను చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ అబ్దుల్ నయూం, అదిబ్, ఇప్ప్యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ బుట్టో తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



దామరగిద్ద: గ్రామంలోని పేదలకు విజయలక్ష్మి ఫౌండేషన్ నిర్వహకులు అందిస్తున్న సేవలు ప్రసంశనీయమని వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న అన్నారు. బుధవారం ఫౌండేషన్ చైర్మన్ వీరప్రసాద్ తన భార్య విజయలక్ష్మి వర్ధంతి సందర్భంగా గ్రామంలోని 15మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏటా విజయలక్ష్మి వర్ధంతి రోజున పేదలకు తన వంతుసేవలను అందించడం అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, రొంపల్లి సంతోష్‌కుమార్, మల్లారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట: ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో పలు సమస్యలు ఉన్నాయని, రెగ్యులర్ ఎంఈఓలు లేకపోవడంతో పర్యవేక్షణ కరువై విద్యాభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో జీహెచ్ఎంలు లేక ఇన్‌చార్జి హెచ్ఎంలతో సర్దుకుపోతున్నాయన్నారు. 15 వేల ఉపాధ్యాయ పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్నాయని వెంటనే డీఎస్సీతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్వేరో సభ్యులు ఆశోక్, బాలరాజు, వెంకటేశ్, శ్రీకాంత్, రాజు తదితరులు ఉన్నారు.

## గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయగౌడ్



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ విజయగౌడ్ బుధవారం రాష్ట్రగౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా విజయగౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర బాధ్యతలు అప్పగించారని, వారి నమ్మకం వమ్ముకాకుండగా గౌడ సంఘం సభ్యుల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ మేరకు ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల గౌడ సంఘం నాయకులు ఆయనను అభినందించారు.

## ఆలయాల్లో అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలలో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. ఆలయంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్పస్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వరస్వామి ఆలయం, మహంకాళీవీధి శివాలయం, జంగిడిగడ్డ పొల్కమ్మ ఆలయం, తాయమ్మగుడితోపాటు మండలంలోని సింగారం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలుచేసి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీసభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఊట్కూరు: అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం బసవన్న ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, అష్టోత్తరం, అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శంకర్, వెంకట్రాములు, రఘువీర్, తమ్మిరెడ్డి, తొగటి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: పవిత్ర శ్రావణమాసం నెల ప్రారంభం కావడంతో బుధవారం మండలంలో గ్రామస్తులు ఘనంగా శ్రావణమాసం పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి జల, పంచమృతాభిషేకం, ఆకుల పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## కృష్ణా బ్రిడ్జిపై నిలిచిన ట్రాఫిక్



నిలిచిపోయిన వాహనాలు

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జిపై రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ఆకస్మత్తుగా మరమ్మతులకు లోనై నిలిచిపోయింది. దీంతో అటు కర్ణాటకలోని దేవసూగూర్ వైపుతో పాటు ఇటు మూడు కిలో మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 7గంటలకు శక్తినగర్, కృష్ణాపోలీసులు సంయుక్తంగా నిలిచిపోయిన వాహనానికి మరమ్మతులు చేయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## వాజ్‌పేయికి ఘన నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దూరు: భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు.. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సాయిలు, నాయకులు గుండప్ప, కన్నప్ప, రాఘవేంద్రచారి, శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, గురుకర్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### కఠినంగా శిక్షించాలి

దామరగిద్ద: మండలంలో మౌనికపై దారుణానికి పాల్పడిన దుండగుడిని వెంటనే అరెస్ట్‌చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజున ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా దర్శి మండలంలో అగ్రకులానికి చెందిన వ్యక్తి కూతురును ప్రేమ వివాహం చేసుకున్న దళితుడి కుటుంబంపై శాడికంగా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# సమగ్ర అభివృద్ధికి పోరాటం చేద్దాం



మాట్లాడుతున్న రఘువీర్

కోస్గి: రాష్ట్రంలో ఉన్న యాదవ జాతీయ సమగ్ర అభివృద్ధికోసం యాదవ కులమంతా ఏకమై పోరాటం చేద్దామని అఖిల భారతయాదవ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రఘువీర్ యాదవ్ సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలోని యాదవ కులానికి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మొత్తం ఏడువేల మంది రాయితీ గొర్రెల కోసం డీడీలు కడితే కేవలం 384మందికి మాత్రమే గొర్లను ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే యాదవ యుద్ధబేరికి పెద్దఎత్తున తరలి రావాలన్నారు. బస్వరాజ్, నర్సింహులు, వెంకటయ్య, రమేష్, నరేష్, అనంతయ్య, తిరుపతి, నాగులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: 25న హైదరాబాద్‌లోని నిర్వహించే యాదవ యుద్ధభేరి పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో యాదవమహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘువీర్‌యాదవ్, మహాసభ జిల్లా కన్వీనర్ తిరుపతియాదవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులకు అన్నిపార్టీలో 22 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని, జనాభాలో 18శాతం ఉన్న యాదవ కార్పొరేషన్ ఏర్పాటుచేసి 18 శాతం నిధులు కేటాయించాలని తదితర డిమాండ్ల సాధనకు యుద్ధభేరిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలప్ప, పెంటయ్య, చిన్నయ్య, రాములు, లాలప్ప, నర్సింహులు, హన్మంతు, రాములు పాల్గొన్నారు.

## సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి





సమ్మెలో మాట్లాడుతున్న కొండన్న

నారాయణపేట: సెకండ్ ఏఎన్ఎంలు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ రాష్ట్రశాఖ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. గత 18ఏళ్లుగా గ్రామీణా ప్రాంతాల్లో పసిబిడ్డల టీకాలతో మొదలుగాకొని ప్రజల ఆరోగ్యానికి అన్నిరకాల వైద్యసేవలను అందేవిధంగా అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి ఏఎన్ఎంలను వెట్టిచాకిరి చేయించుకోవడం దారుణమైన విషయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 : 40 నిష్పత్తిలో నిర్వహిస్తున్న ఎన్‌హెచ్ఎం స్కీంలో వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగులపై బాధ్యత రహితంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులనుసైతం అమలు చేయకుండా ప్రభుత్వం రాజ్యాంగా ఉల్లంఘనకు పాల్పడుతుందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సవిత, రాణి, వెంకటేశ్వరమ్మ, చంద్రకళ, అనసూయ, వరలక్ష్మి, దేవిక, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## డబ్బుల వసూళ్లపై విచారణ చేపట్టాలి



జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నర్వ: ఇళ్లస్థలాల పంపిణీలో డబ్బుల వసూళ్లపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బాధితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్‌అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ... నాగిరెడ్డిపల్లిలో పంపిణీ చేసిన ఇళ్లస్థలాల పంపిణీలో ఒక్కో లబ్ధిదారుడు నుంచి రూ. 5వేలు వసూలు చేశారన్నారు. ఇళ్లస్థలాలు లేని అర్హులకు గ్రామసభ నిర్వహించి ఎంపిక చేయాల్సి ఉండగా.. అలా కాకుండా విరుద్ధంగా ఎంపిక చేశారన్నారు. నాయకులు డబ్బులు తీసుకోవడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్‌తోపాటు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐదోవార్డు సభ్యులు మొగిలన్న, కె.రాజు తదితరులు ఉన్నారు.

## పాపన్నగౌడ్ జయంతిని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న గౌడసంఘం నాయకులు

ఊట్కూరు: జిల్లా కేంద్రంలో ఈనెల 18న నిర్వహించే సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని జయప్రదం చేయాలని గౌడసంఘం నాయకులు శంకర్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని వారు విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో జరిగే ఉత్సవాలకు మండలంలోని గీతాకార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్, నర్సింహరాజు, బాలరాజుగౌడ్, విశ్వనాథ్‌గౌడ్, నవీన్‌గౌడ్, రఘుగౌడ్ పాల్గొన్నారు.

### మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఆర్‌పీ

ఊట్కూరు: మండలంలోని పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు – మన బడి పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి మాట్లాడారు. మండలంలోని 18 పాఠశాలల్లో పనులు కొనసాగుతుండగా.. 95 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పెయింటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆయనవెంట సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌కుమార్, ఈఈ రాంచందర్, రాము, వెంకట్‌రెడ్డి, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలలు తనిఖీ చేసిన డీఆర్‌పీలు**

ఊట్కూరు: మండలంలోని మల్లేపల్లి, కొల్లూరు ప్రాథమిక పాఠశాలలను బుధవారం డీఆర్‌పీలు శ్రీకాంత్, రాఘవేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో కొనసాగుతున్న వెలుగు అభ్యసన మిత్ర కార్యక్రమాన్ని పరిశీలించారు. తరగతిలో సి–గ్రేడ్ విద్యార్థుల స్థాయి పెంచేందుకు వర్క్ షీట్లు ప్రతిరోజు పూర్తయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెలుగు అభ్యసనమిత్ర 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎంలు నర్సింగప్ప, కృష్ణ పాల్గొన్నారు.